క్లుప్తంగా

నేడు మంత్రుల పర్యటన

తొగుట(దుబ్బాక): జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం మండలంలో పర్యటిస్తారని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన తొగుటలో మాట్లాడుతూ మధ్యాహ్నం 1 గంటకు మండల కేంద్రంలో రూ 3.87 కోట్ల వ్యయంతో నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల భవనం, రూ 30 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రూ 16 లక్షలతో నిర్మించిన డైనింగ్ హాల్, రూ 25లక్షలతో నిర్మించిన వాటర్ ట్యాంకు, రైతు వేదికలను మంత్రులు ప్రారంభిస్తారన్నారు. అనంతరం మల్లన్న సాగర్ నుంచి దుబ్బాక కాలువకు నీటిని మంత్రి విడుదల చేస్తారని వెల్లడించారు.

బాధ్యతల స్వీకరణ

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని మూడు గ్రామాలకు పంచాయతీ కార్యదర్శులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మంగళవారం వారు బాధ్యతలు స్వీకరించారు. మర్మాముల గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న రేణుక కొన్ని రోజుల క్రితం మిరుదొడ్డి మండలం కాసులాబాద్‌కు డిప్యూటేషన్‌పై బదిలీ చేశారు. ఆమెను మళ్లీ మర్మాముల పంచాయతీ కార్యదర్శిగా పంపించారు. కమాలయపల్లి పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న స్నేహ కొన్ని క్రితం సెలవుపై వెళ్లింది. ఆమె సెలవులు ముగియడంతో ప్రభుత్వం ఆమెను మళ్లీ కమాలయపల్లి పంచాయతీ కార్యదర్శిగా పంపింది. అలాగే గాగ్గిళ్లాపూర్ పంచాయతీ కార్యదర్శిగా రాయపోల్ మండలం టెక్కంపేట పంచాయతీ కార్యదర్శిగా రజియా డిప్యూటేషన్‌పై వచ్చారు.

నూతన పాఠశాల భవనం ప్రారంభం



పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ రమణారెడ్డి, వైస్ ఎంపీపీ రాజేందర్ రెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని అయినాపూర్ గ్రామంలో నూతనంగా రూ.60 లక్షల వ్యయంతో నిర్మించిన ప్రాథమిక పాఠశాల భవనాన్ని సర్పంచ్ చెరుకు రమణారెడ్డి వైస్‌ఎంపీపీ కాయిత రాజేందర్‌రెడ్డితో కలసి మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు అఫ్జల్, ఏర్పుల కృష్ణ, దండు రవి, కుక్కల అశోక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో పూజలు చేయడం సరికాదు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో శ్రీరాముడి పూజలు నిర్వహించడం సరికాదని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అరవింద్, ప్రశాంత్ అన్నారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో విద్యాశాఖ ఏడీకి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ భారత దేశం సెక్యులర్ దేశమని, పాఠశాలల్లో రామాయణ సంబంధిత నాటకాలు వేయడం సరికాదన్నారు. అయోధ్యలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా జిల్లాలోని అనేక ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శ్రీరాముడి వేషధారణల్లో చిన్నారులు నాటకాలు వేశారన్నారు. శ్రీరాముడిపై ఉపన్యాస పోటీలు నిర్వహించారన్నారు. సెక్యులర్ దేశంలో అన్ని మతాలకు స్వేచ్ఛ ఉంటుందని, అందువలన పాఠశాలల్లో మతసంబంధిత కార్యక్రమాలు నిర్వహించరాదన్నారు. కార్యక్రమంలో పవన్, అనిల్ పాల్గొన్నారు.

వరిలో సస్యరక్షణ తప్పనిసరి

దుబ్బాక: పంటల సాగులో తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చేపట్టాలని దుబ్బాక మండల వ్యవసాయాధికారి ప్రవీణ్ కుమార్ మంగళవారం అన్నారు. వరిలో ఎరుపు రావడం, జింక్ లోపం, మొగిపురుగు, నాచు రావడం గమనించామన్నారు. దుబ్బాక మండల వ్యాప్తంగా 28 వేల ఎకరాలలో రైతులు వరి సాగుచేశారని పేర్కొన్నారు. జింక్ లోపంతో ఆకులు ఎర్రబడి పెళుసుబారుతాయని, లేత ఆకులపై మచ్చలు ఏర్పడుతాయన్నారు. ఇందుకు చెలేటెడ్ జింక్ లేదా జింక్ సల్ఫేట్ పిచికారీ చేయాలని సూచించారు. మొగిపురుగు నివారణకు కార్టాప్ హైడ్రోకోడ్, 4 జీ గుళికలను ఎకరాకు పది కిలోలు లేదా కార్బోఫోరన్ 3 జీ గుళికలు 8 కిలోలు చల్లాలన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గాగిల్లాపూర్ శివారులోని మోయతుమ్మెద వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి ఇసుకను అక్రమంగా రవాణా చేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి

మర్కూక్(గజ్వేల్): కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని అధికారులు కాపాడాలంటూ మండలంలోని కాశిరెడ్డి పల్లి గ్రామస్తులు మంగళవారం ఉపతహసిల్దార్ భ్యాగరేఖకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని 252 సర్వేనంబర్‌లోని 3.25 గుంటల ప్రభుత్వ భూమి గతంలో కల్యాణ మండపం నిర్మాణం కోసం కేటాయించారని, దాని పక్కనే ఉన్న కొంతమంది కబ్జా చేశారని ఆరోపించారు.

నాణ్యతకు తిలోదకాలు

- ఆరేళ్ల క్రితం ఏఎంసీ కార్యాలయ భవన నిర్మాణం
- వర్షాలకు తేమ వస్తుందని కూల్చివేతకు ఆదేశం
- ప్రజాధనం దర్వినియోగంపై ప్రజల ఆగ్రహం



చిన్నకోడూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ భవనం మొదటి అంతస్తును కూల్చివేస్తున్న సిబ్బంది

చిన్నకోడూరు(సిద్దిపేట): రూ.లక్షల వ్యయంతో చేపట్టిన పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకపోగా, నిర్మించిన వాటిని కూల్చివేసి తిరిగి పనులు చేపడుతూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అప్పటి ప్రభుత్వం రాష్ట్రంలో మండలానికి ఒక వ్యవసాయ మార్కెట్ కమిటీని ఏర్పాటు చేసింది. 2017 నవంబర్‌లో రూ.60 లక్షలతో చిన్నకోడూరులో మార్కెట్ కమిటీ కార్యాలయం నిర్మించి అప్పటి ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. ఆ కార్యాలయాన్ని నిర్మించిన మొదటి ఏడాదికే మొదటి అంతస్తులో వర్షాలకు నీరు కారుతోంది. అప్పటి మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి మరమ్మతులు చేయించారు. అయినా వర్షాలు కురిసినప్పుడు వర్షపు నీరు కారుతోంది. మూడో చైర్మన్ పదవీ కాలం పూర్తయ్యేలోపే కార్యాలయాన్ని కూల్చడం ప్రారంభించారు. 50 ఏళ్లు ఉండే కార్యాలయ భవనం ఆరు సంవత్సరాలకే కూల్చి వేయడంతో ప్రభుత్వ సొమ్ము వృథా అవుతోందని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఇలాంటి పరిస్థితి నెలకొందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయంపై సంబంధిత వ్యవసాయ శాఖ జిల్లా అధికారి నాగరాజును వివరణ అడగగా కార్యాలయ భవనం మొదటి అంతస్తు వర్షాలకు తేమ వస్తుందని, అందుకే కూల్చి వేసి తిరిగి నూనతంగా నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ట్రస్టుపాలక మండలి సభ్యుడు పెద్దంకుల శ్రీనివాస్ తదితరులు

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి

ట్రస్టు పాలక మండలి సభ్యులు పెద్దంకుల శ్రీనివాస్

కొండపాక(గజ్వేల్): లోక కల్యాణం కోసం నిర్వహించే బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని స్వయం భూ లింగేశ్వర స్వామి ట్రస్టు పాలకమండలి సభ్యులు పెద్దంకుల శ్రీనివాస్ మంచాల శ్రీనివాస్‌లు కోరారు. మండల పరిధిలోని దుద్దెడలో ఫిబ్రవరి 5, 6, 7వ తేదీల్లో నిర్వహించే వార్షిక బ్రహ్మోత్సవాల కరపత్రాన్ని మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుద్దెలో చారిత్రక శైవక్షేత్రం స్వయంభూ శంభులింగేశ్వరుడు వెలిసినప్పటి నుంచి ఈ ప్రాంతం సుభిక్షంగా ఉంటుందన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించే జాతరలో గ్రామం నుంచి వివిధ ఉద్యోగాలు, వ్యాపార రిత్యా పట్టణాలకు వలస వెళ్లిన వారు సైతం బ్రహ్మోత్సవాల్లో పాల్గొని మొక్కులు తీర్చుకుంటారు. చివరి రోజు శివపార్వతుల కల్యాణం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు వడ్లకొండ శ్రీనివాస్, నర్ర రాఘవరెడ్డి, గోనె శ్రీనివాస్, నూనె కుమార్, మంచాల కృష్ణమూర్తి, వెంకటరమణ, దేశాయిరెడ్డి, పంజ అఖిల్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు వినియోగంలోకి..

ఎంఆర్‌సీ భవనం ప్రారంభం



ఎంఆర్‌సీని ప్రారంభిస్తున్న ఎంఈఓ నరసింహారెడ్డి

సాక్షి ఎఫెక్ట్

అక్కన్నపేట(హుస్నాబాద్): ఈనెల 4వ తేదీన సాక్షిలో 'నిర్మించారు..వదిలేశారు', మందుబాబులకు అడ్డగా ఎంఆర్‌సి భవనం అంటూ కథనాలను పలుమార్లు ప్రచురించగా విద్యాశాఖ అధికారులు స్పందించారు. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఈ భవనాన్ని ప్రారంభించారు కానీ, ఫర్నిచర్, కంప్యూటర్‌ను ఏర్పాటు చేయలేదు. దీంతో నాలుగేళ్లుగా భవనం నిరుపయోగంగా ఉంది. మంగళవారం ఎంఈఓ నరసింహారెడ్డి తన సొంత డబ్బుతో వసతులు కల్పించి భవనాన్ని వినియోగంలోకి తెచ్చారు. కార్యక్రమంలో మండల నోడల్ ఆఫీసర్ గుగులోతు రంగనాయక్, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, ఎల్ఎఫ్ఎల్‌హెచ్ఎం కనకయ్య, ఉపాధ్యాయులు రమాదేవి, రాజశేఖర్, సీసీ సంజయ్, సీఆర్‌పీ లక్ష్మణ్‌నాయక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో సత్తా చాటాలి

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఇటీవల ఖోఖో రాష్ట్రస్థాయి పోటీలు డిసెంబర్ 20 నుంచి 22 వరకు ఆసిఫాబాద్ జిల్లాలో జరిగాయి. ఈ పోటీల్లో తిగుల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని వెన్నెల ప్రతిభ చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. మంగళవారం సర్పంచ్ భానుప్రకాష్‌రావు ఆమెను సన్మానించారు. జనవరి 30 నుంచి జార్కండ్ రాష్ట్రం రాంచీలో జరిగే జాతీయ స్థాయిలో పోటీల్లో ప్రతిభ చాటి పేరు గ్రామానికి పేరు తేవాలని కోరారు. అలాగే ప్రయాణ ఖర్చులకు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం అనుసూయ, పీఈటీ రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువత ఆశయాలకు అనుగుణంగా మోదీ సర్కార్

గజ్వేల్‌రూరల్: యువత ఆశయాలకనుగుణంగా మోదీ సర్కార్ పనిచేస్తోందని బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మనోహర్‌యాదవ్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నమో నవ్ మత్ దాత సమ్మేళన్‌లో నమోదు చేసుకునేందుకు విద్యార్థులతో రిజిస్ట్రేషన్ చేసి, మిస్డ్‌కాల్ ఇప్పించారు. ఈనెల 25వ తేదీన జరిగే కార్యక్రమంలో నూతన యువ ఓటర్లు ప్రధాని నరేంద్రమోదీతో జరిగే సంభాషణలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మహిపాల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆ స్థలం విక్రయిస్తే కఠిన చర్యలు

చేర్యాల(సిద్దిపేట): స్థానిక ఇండియా మిషన్ చర్చి ఆవరణంలోని కొంత స్థలాన్ని కొందరు ఆక్రమించి విక్రయించే ప్రయత్నం చేస్తున్నారని, ఆ స్థలం ఎవరికి విక్రయించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పలువురు క్రైస్తవులు హెచ్చరించారు. మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ 1930లో చర్చి ప్రారంభించి, ఆధ్యాత్మికంగా అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. కాగా మిషన్ నాయకుల మంటూ కొందరు చర్చి స్థలాన్ని కాజేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై ఎఫ్ఈసీ, ఐఎంఐ కమిటీలు తక్షణమే స్పందించి పరిరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీదే విజయం

కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు వాసుదేవ రెడ్డి



హుస్నాబాద్‌లో బీజేపీ ముఖ్య నాయకుల సమావేశం

హుస్నాబాద్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తుందని ఆ పార్టీ కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు వాసుదేవ రెడ్డి, కోఆర్డినేటర్ గుజ్జ సత్యనారాయణ అన్నారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పట్టణ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన కార్యచరణ, ప్రణాళికపై చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ భారత మోదీ తొమ్మిది సంవత్సరాలుగా చేసిన అభివృద్ధి, ప్రవేశపెట్టిన పథకాలు ప్రజలకు తెలిపేందుకు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం పట్టణంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం బ్యాంక్, ప్రభుత్వ అధికారులు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు, పార్టీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ లక్కిరెడ్డి తిరుమల, అసెంబ్లీ కో కన్వీనర్ వేణుగోపాల్ రావు, జిల్లా కోశాధికారి దొడ్డి శ్రీనివాస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన ఉండాలి

గజ్వేల్‌రూరల్: భారత రాజ్యాంగంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణులు అన్నారు. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 74 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా మండల పరిధిలోని బెజుగామ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మంగళవారం రాజ్యాంగంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

ఆర్థిక సహాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కిడ్నీ బాధితుడికి జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేశారు. సిద్దిపేటకు చెందిన ఓ నిరుపేదకు రెండు కిడ్నీలు పాడవటంతో డయాలసిస్ చేయుంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విషయం తెలుసుకున్న సిద్దిపేట ఆర్యవైశ్య మహాసభ సభ్యులు బాధితుడికి మంగళవారం రూ.56 వేల ఆర్థిక సహాయం అందించారు.

పాఠశాలకు క్రీడా సామగ్రి బహూకరణ



క్రీడా సామగ్రిని అందజేస్తున్న వ్యాపార వేత్త శ్రీకాంత్‌రెడ్డి

వర్గల్(గజ్వేల్): మండలంలోని అనంతగిరిపల్లి ప్రాథమిక పాఠశాలకు గౌరారం గ్రామానికి చెందిన వ్యాపారవేత్త శ్రీకాంత్‌రెడ్డి క్రీడా సామగ్రి బహూకరించారు. మంగళవారం వేలూరు కాంప్లెక్స్ హెచ్ఎం కృష్ణ సౌజన్య, టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్ సమక్షంలో క్రీడా పరికాలను హెచ్ఎం గీతారాణికి అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం కృష్ణ సౌజన్య మాట్లాడుతూ పాఠశాలల్లో ఆటల నిర్వహణ ద్వారా విద్యార్థులలో ఒత్తిడిని తగ్గించి, మానసిక ఉల్లాసం కలిగిస్తుందన్నారు. అంతేకాకుండా శారీరక దృఢత్వం కలిగి చదువుపై ఆసక్తి పెంపొందుతుందన్నారు. క్రీడాసామాగ్రి బహూకరించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ తుమ్మల స్వామి, ఉపాధ్యాయుడు సంపత్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులను క్రమబద్ధీకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ శ్రీనివాస్

సిద్దిపేటకమాన్: స్వచ్ఛభారత్‌కు ప్రతిరూపమైన పారిశుద్ధ్య కార్మికులను క్రమబద్ధీకరించి, స్వచ్ఛభారత్‌కు బ్రాండ్ అంబాసిడర్లుగా ప్రకటించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. మంగళవారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులను క్రమబద్ధీకరించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయన్నారు. ఫిబ్రవరి 29వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్‌లో నిర్వహించ తలపెట్టిన పోరుగర్జనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి కాశపాక రాజేందర్, కుమార్, వెంకటేశ్, పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పరాక్రమ్ దివస్

నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు ఘన నివాళి



నేతాజీ విగ్రహానికికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

సిద్దిపేట ఎడ్యుకేషన్/ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పరాక్రమ్ దివస్‌గా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ, ప్రవేట్ కాలేజీలు, పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. మంగళవారం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన పరాక్రమ్ దివస్‌కు ప్రిన్సిపాల్ డాక్టర్ జీవన్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సీతారాములు, డాక్టర్ స్రవంతి, డాక్టర్ సామ సువర్ణాదేవి తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి 23వ తేదీని సెలవు దినంగా ప్రకటించాలని పలు పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. హుస్నాబాద్‌లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ 127వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. సుభాష్ చంద్రబోస్ స్థాపించిన ఆర్మీ పేరుతోనే ఇండియా ఆర్మీ పని చేస్తుందన్నారు. హుస్నాబాద్‌లో ఆయన విగ్రమ ఏర్పాటుకు మంత్రి పొన్నం ప్రభాకర్ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ రవీందర్ గౌడ్, బీఎస్పీ నాయకుడు ఎనగందుల శంకర్, బీజేపీ నాయకుడు కవ్వ వేణుగోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చేర్యాల(సిద్దిపేట): నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని దేశ్ ప్రేమ్ దివస్‌గా ప్రకటించాలని ఏఐఎస్బీ రాష్ట్ర కార్యదర్శి పుల్లని వేణు డిమాండ్ చేశారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ 126వ జయంతిని పురస్కరించుకొని మంగళవారం పట్టణ కేంద్రంలోని ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

సిద్దిపేటజోన్: ఎస్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో మంగళవారం సుభాష్ నగర్‌లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండల్ రెడ్డి మాట్లాడుతూ చంద్రబోస్ ఆశయ సాధనకు యువత కృషిచేయాలన్నారు.

మర్కూక్(గజ్వేల్): స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని మండలంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని అంగడి కిష్టాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రాధానోపాధ్యాయుడు ఓంకార్ ఆయన చిత్రపటనికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు సుభాస్ చంద్రబోస్ వేషధారణలో ఆకట్టుకున్నారు.

గజ్వేల్‌రూరల్: పరాక్రమ దివస్ ప్రేరణతో నవభారత నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలని జాతీయ యువజన అవార్డు గ్రహీత, యువజన సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేశబోయిన నర్సింలు పిలుపునిచ్చారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ 127వ జయంతి సందర్భంగా మంగళవారం గజ్వేల్‌లోని స్వామి వివేకానంద విగ్రహం వద్ద నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లోగల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ గణపతి, అధ్యాపకులు పాల్గొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు జయంతి తప్ప వర్ధంతి లేదని శ్రీ రామకోటి భక్తసమాజం వ్యవస్థాపకుడు రామకోటి రామరాజు అన్నారు. మంగళవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా రూ. 10 పైసల నాణాలతో నేతాజీ ఆకృతిని చిత్రించి నివాళులర్పించారు.



అంగడి కిష్టాపూర్‌లో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): దేశ స్వాతంత్ర్యం కోసం నిరంతరం కృషి చేసిన మహనీయుడు సుభాష్ చంద్రబోస్ అని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుముల మురళీధర్ అన్నారు. ఆయన 127వ జయంతిని మంగళవారం జిల్లా కేంద్రంలో తపస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సంక్షిప్త వార్తలు

◆ కార్యర్తలు సిద్ధం కావాలి

కోహెడ(హుస్నాబాద్): రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం కార్యకర్తలు సిద్ధం కావాలని ఆ పార్టీ కోఆర్డినేటర్ క్లెం వాసుదేవరెడ్డి పిలుపు ఇచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన బూత్‌స్థాయి మండల ముఖ్య కార్యక్తలతో సమావేశానికి హాజరై మాట్లాడారు. బూత్‌స్థాయిలో పటిష్టమైన కార్యకర్తల జాబితా అందించాలని మండల నాయకులను ఆదేశించారు.

◆ షబ్బీర్ అలీ నియామకం హర్షనీయం

గజ్వేల్: కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్‌అలీని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడిగా నియమించడం హర్షనీయమని గజ్వేల్ కాంగ్రెస్ మైనార్టీ సెల్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పార్టీకి షబ్బీర్‌అలీ చేసిన సేవలను గుర్తించి సముచిత స్థానం కల్పించారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ అధిష్టానానికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

◆ మిల్లర్లపై చర్యలు తీసుకోవాలి

హుస్నాబాద్: ధాన్యాన్ని పక్కదారి పట్టిస్తున్న రైస్ మిల్లర్లపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పౌరసరఫరాల మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర విజిలెన్స్ అధికారులకు ఫ్యాక్స్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా ఉపాధ్యక్షుడు కవ్వ వేణుగోపాల్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైస్, బాయిలర్ మిల్లర్లు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత డిమాండ్ పెరగడంతో ప్రభుత్వం ఇచ్చిన ధాన్యాన్ని ప్రైవేట్ వ్యక్తులు, ఇతర రాష్ట్రాలకు విక్రయిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

◆ దివ్యాంగులకు దుస్తుల పంపిణీ

దుబ్బాకటౌన్: పట్టణంలోని 45 మంది దివ్యాంగులకు జీవోదయ ట్రస్టు చేయూత అందించింది. మంగళవారం వారికి దుస్తులు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు అశోక్ హాజరై మాట్లాడారు. దివ్యాంగుల సంక్షేమానికి కృషిచేస్తున్న జీవోదయ ట్రస్టు నిర్వాహకులు అభినందనీయులన్నారు. దివ్యాంగులకు సాయం అందించేందుకు స్వచ్ఛం సంస్థలు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు హెచ్.భాస్కర్, మంజుల పాల్గొన్నారు.

◆ సురేందర్‌రావు సేవలు చిరస్మరణీయం

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల పట్టణానికి కల్వకోట సురేందర్‌రావు చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు ప్రముఖులు అభిప్రాయపడ్డారు. సోమవారం రాత్రి పట్టణ కేంద్రానికి చెందిన భూదాత కల్వకోట సురేందర్‌రావు(80) అనారోగ్యంతో మృతిచెందారు. మంగళవారం ఆయన పార్థివ దేహంపై పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. వందల ఎకరాల భూమిని ప్రభుత్వ కార్యాలయాలు, కళాశాలల ఏర్పాటు కోసం ప్రభుత్వానికి ఉచితంగా ఇచ్చిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. నివాళులర్పించిన వారిలో మాజీ ఎమ్మెల్సీ రాజలింగం, మున్సిపల్ చైర్ పర్సన్ స్వరూపరాణి, సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి, సీపీఐ జిల్లా సమితి సభ్యులు ఉన్నారు.

◆ సెంట్రింగ్ బాక్సుల చోరీ

గజ్వేల్‌రూరల్: భవన నిర్మాణంలో వినియోగించిన సెంట్రింగ్ బాక్సులు చోరీ చేసిన సంఘటన గజ్వేల్ పట్టణంలో చోటు చేసుకుంది. మండల పరిధిలోని బంగ్లావెంకటాపూర్‌కు చెందిన పాండి సంజీవులు భవన నిర్మాణాలకు సెంట్రింగ్ సామాన్లు సరఫరా చేస్తుంటాడు. ఈ క్రమంలో పట్టణంలోని నాగమున్నయ్య ఆసుపత్రి వెనుక నిర్మిస్తున్న ఓ భవనానికి 104 సెంట్రింగ్ బాక్సు ప్లేట్లు, 23 జాకీలను సరఫరా చేశాడు. పని పూర్తికావడంతో ఈనెల 21న సెంట్రింగ్ సామగ్రిని విప్పి అక్కడే ఉంచి వెళ్లాడు. మరుసటి రోజు 22వ తేదీన వచ్చి చూడగా అవి కనిపించలేదు. దీంతో మంగళవారం గజ్వేల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.